బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

● మంత్రి కొండా సురేఖ


ప్రచారంలో భాగంగా ఉల్లిగడ్డల బేరం చేస్తున్న మంత్రి కొండా సురేఖ

యూసుఫ్‌గూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి కొండా సురేఖ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలితాశ్రీహరి అన్నారు. యూసుఫ్‌గూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతలో భాగంగా అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుంది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్ భార్య వర్ష, మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాశోభన్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలో..


ప్రచారం చేస్తున్న డాక్టర్ కోట నీలిమ

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌కు మద్దతుగా సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ కోట నీలిమ ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


బీఆర్ఎస్ వెంగళరావునగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నవీన్ యాదవ్

బీఆర్ఎస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, బీసీ యాదవ సంఘం అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీశైలం యాదవ్‌లు నవీన్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జవహర్‌నగర్‌లో నవీన్ యాదవ్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, బి.రూప పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విజయశాంతి

ఆవేశంతో కాదు.. ఆలోచనతో ఓటు వేయాలి

● ఎమ్మెల్సీ విజయశాంతి

బోరబండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో ఆవేశంతో కాకుండా ఆలోచనతో ఓటు వేయాలని ప్రముఖ సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి ఓటర్లను కోరారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ గెలుపు కోసం బోరబండ సైట్-3 కాలనీ నుంచి బస్టాండ్ వరకు గురువారం రాత్రి నిర్వహించిన రోడ్ షోలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక బీసీ యువకుడికి పోటీ చేసే అవకాశం ఇస్తే దొంగ, రౌడీ అని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని, ఆయనను మించిన దొంగలు ఎవరు ఉంటారని ప్రశ్నించారు. నవీన్ యాదవ్ మాట్లాడుతూ వాటర్ బాటిళ్లు, టిఫిన్ డబ్బాల రాజకీయాలకు మోసపోవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు డా.చిక్కుడు వంశీకృష్ణ, మందుల సామేల్, యశస్వినిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వై.వెంకటస్వామి, హబీబా సుల్తానా, బోరబండ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

పంజాగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిగూడలో కమ్మ సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఓటర్లు చారిత్రాత్మక తీర్పు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణా రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

● మంత్రులు ఉత్తమ్, పొన్నం
● నవీన్ యాదవ్‌కు కమ్మ, కాపు, గౌడ సామాజిక వర్గాల మద్దతు


మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం

యూసుఫ్‌గూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు కమ్మ, కాపు, గౌడ సంఘాలు మద్దతు ప్రకటించాయి. యూసుఫ్‌గూడ డివిజన్‌లో గురువారం పొన్నం ప్రభాకర్ ప్రచారం చేశారు. మధురానగర్‌లో గౌడ సంఘాల నాయకులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమ్మ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘాల సమైక్య అధ్యక్షులు బొడ్డు రవి శంకర్‌రావు నవీన్ యాదవ్‌కు మద్దతు ప్రకటించారు. సినీ పరిశ్రమకు చిన్న శ్రీశైలం యాదవ్ చేసిన సేవలతోనే చిత్ర పరిశ్రమ నవీన్ యాదవ్‌కు అండగా ఉంటుందని సినీహీరో సుమన్ తెలిపారు.

మైనార్టీలకు ఇందిరమ్మ ఇళ్లు

● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సమావేశానికి హాజరైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో గురువారం మైనార్టీల సమావేశం జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు, ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి చేయూతనందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, అంజద్ పాల్గొన్నారు.


ఎర్రగడ్డ నటరాజ్ నగర్‌లో కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ


ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్

రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ

ఎర్రగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం ఆయన ఎర్రగడ్డ డివిజన్ నటరాజ్ నగర్‌లో కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్ కుటుంబానికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కష్టపడుతున్నారన్నారు. కార్పొరేటర్ విజయారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎర్రగడ్డలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు ఎన్.నారాయణస్వామి, తెలంగాణ రాష్ట్ర వడ్డెర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.రామచందర్‌రావు పాల్గొన్నారు. సుల్తాన్ నగర్‌లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, నాయకులు నరేష్, ఎర్ర కృష్ణ కుమార్, మొహ్మద్ మోసిన్ ఖురేషి పాల్గొన్నారు.


సుల్తాన్ నగర్‌లో ప్రచారం చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కొల్లాపూర్ ప్రజలు నమ్మకంగా పనిచేస్తారు

● మంత్రి జూపల్లి కృష్ణారావు


కొల్లాపూర్ వలస ప్రజల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, అభ్యర్థి నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ ప్రజలు కష్టపడి పని చేసి, నమ్మకంతో ఉంటారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నవీన్ యాదవ్‌కు మద్దతుగా కొల్లాపూర్ నియోజకవర్గ వలస ప్రజల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో ఉన్న కొల్లాపూర్ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలన్నారు. రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకోవడానికి నాటి ప్రభుత్వం అనుమతులు ఇవ్వక పోయినా, చిన్న శ్రీశైలం యాదవ్ వలస ప్రజలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే నగరం అభివృద్ధి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


రహ్మత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు


బోరబండలో ప్రచారం చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

బోరబండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నగరం అభివృద్ధి చెందిందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నేడు లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారంటే దానికి అంకురార్పణ చేసిందే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌కు మద్దతుగా రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలో గురువారం ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రచారం చేశారు. స్థానిక సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులంతా కలిసి సమష్టిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు మాద యాదగిరి, ఐతరాజు యాదయ్య, పులెంల అచ్చాలు, వడ్డె భూపాల్‌రెడ్డి, రేగట్టె సతీష్‌గౌడ్, జేరిపోతుల భరత్‌గౌడ్, నంద్యాల మధుసూదన్‌రెడ్డి, వేముల నర్సింహ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జూబ్లీహిల్స్‌కు మహర్దశ

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వెంగళరావునగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జూబ్లీహిల్స్‌కు మహర్దశ పట్టనున్నట్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గురువారం వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్, సిద్ధార్థనగర్, వెంగళరావునగర్ ఏ-బ్లాక్‌లలో అపార్ట్‌మెంట్ వాసులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సుమన్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వి.చిన్నశ్రీశైలం యాదవ్, దుర్గాప్రసాద్, కోనేరు చిన్ని, చిలకల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. నవీన్ యాదవ్‌తో కలిసి వెంగళరావునగర్ డివిజన్ ఏజీ కాలనీ, కళ్యాణ్ నగర్‌లో వారు పాదయాత్ర చేశారు. వారి వెంట రాష్ట్ర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రముఖ సినీనటుడు సుమన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాఘమయి దయానంద్, గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరితతిరుపతయ్య యాదవ్, బీసీ జేఏసీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, అసద్, మాజీ కార్పొరేటర్ మనోహర్, పార్టీ నాయకులు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు ఉన్నారు.


నవీన్ యాదవ్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి


ప్రచారంలో పాల్గొన్న సినీనటుడు సుమన్, చిన్నశ్రీశైలం యాదవ్

మధురానగర్ షాలిమార్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మధురానగర్ కాలనీలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి, సినీనటుడు సుమన్, వి.చిన్న శ్రీశైలం యాదవ్, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కృష్ణ రాజ్‌పుత్, స్వరూపగౌడ్ పాల్గొన్నారు.


సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విజయశంకరస్వామి తదితరులు

జైహో మూడో జాతీయ సమ్మేళనం

● 8, 9వ తేదీల్లో ఎల్బీనగర్‌లోని సూర్యోదయ కాలనీలో..

పంజాగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశ్వమానవాళి హితాన్ని కాంక్షించే మహోన్నత విలువలు ప్రతీ మతంలో ఉన్నాయని జైహో జాతీయ అధ్యక్షుడు విజయశంకరస్వామి అన్నారు. మతోన్మాదుల విద్వేషపు, అసహనపు పెడధోరణులతో ఈ విలువలు మరుగున పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మతం వేరు మతోన్మాదం వేరని, మతవేదికల నుంచి అన్ని రకాల మతోన్మాదాలను తరిమికొట్టాలని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎల్బీనగర్ సూర్యోదయ కాలనీలో ఈనెల 8,9వ తేదీల్లో నిర్వహించనున్న జైహో మూడో జాతీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆయన సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి ముస్తాఖ్ అహ్మద్ అభిలాష్, అచల యోగిని డేరంగుల నారాయణమ్మ, శివగీత పీఠాధిపతి సోమేశ్వరస్వామితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్, రజిని, న్యాయవాది రఘు కుమార్, సర్వోదయ ప్రసాద్, జైహో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాసి డి.లక్ష్మేశ్వర్,జైభారత్ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాసి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒకే రోజు లక్ష కిలోల బియ్యం అందజేత

● ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు


బియ్యంతో ఉన్న వాహనాలను ప్రారంభించిన శిరీష ఓరుగంటి

హైటెక్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు తమ వంతు సహాయంగా స్వచ్ఛంద సంస్థల ద్వారా లక్ష కిలోల బియ్యాన్ని అందజేసినట్టు లాయిడ్స్ ఆఫ్‌షోర్ గ్లోబల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ శిరీష ఓరుగంటి తెలిపారు. గురువారం ఐటీకారిడార్‌లో జరిగిన కార్యక్రమంలో లక్ష కేజీల బియ్యంతో ఉన్న మూడు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. తమ సేవల ద్వారా పేదలను అక్కున చేర్చుకుంటున్న 55 స్వచ్ఛంద సంస్థలకు బియ్యం అందజేశారు. వాటిలో 50 వేల కేజీల బియ్యాన్ని ఉద్యోగులు సమకూర్చగా, మిగతా 50 వేల కిలోలను సంస్థ అందజేసింది. సీఎస్ఆర్‌లో భాగంగా ఒకే రోజు లక్ష కిలోల బియ్యాన్ని సమకూర్చినందుకు ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి సంస్థ నిర్వాహకులు సర్టిఫికెట్ అందుకున్నారు.

అవినీతి, స్కాముల మచ్చలేనిది బీజేపీ

● ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ఎర్రగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ 4జీ, 5జీ, హెలికాప్టర్ స్కామ్‌లలో ఇరుక్కుపోయిందని, కాంగ్రెస్ పార్టీ మాదిరిగా బీజేపీకి ఎటువంటి స్కామ్‌లతో గానీ, అవినీతితోగానీ సంబంధం లేకుండా స్వచ్ఛంగా పరిపాలన జరుగుతోందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. గురువారం ఎర్రగడ్డలోని సిటాడెల్ బ్రిగేడ్ అపార్ట్‌మెంట్ వాసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మాదిరిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కూడా అవినీతి లేని పాలన రావాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. ఓ వర్గానికి చెందిన ఓట్లను రాబట్టుకోవడం కోసమే కాంగ్రెస్ పార్టీ ఎర్రగడ్డలో ప్రభుత్వ భూమిని కబ్రస్తాన్‌కు కేటాయించిందన్నారు. అపార్ట్‌మెంట్‌వాసులకు వెసులు బాటుగా ఉండేందుకు కల్పతరువు నుంచి హైటెక్ సిటీ వరకు రోడ్డు విస్తరణ చేసేందుకు కృషి చేస్తామన్నారు. బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ ఏమీ తెలియని మహిళ కావాలో.. రౌడీ కావాలో.. మోదీ కావాలో ఓటర్లు తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు వెంకటేష్‌నేత, సిటాడెల్ బ్రిగేడ్ డైరెక్టర్ శ్యామ్ కుమార్, కల్పతరు రెసిడెన్సీ మాజీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ చేకూరు హనుమంతునాయుడు, బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జి మేకల సారంగపాణి, నాయకులు అశోక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విజయకుమార్, గణేశ్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను గెలిపించాలి


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత

యూసుఫ్‌గూడ/ఎర్రగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు యూసుఫ్‌గూడ చౌరస్తా నుంచి కృష్ణానగర్ వరకు గురువారం పాదయాత్ర చేశారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, పద్మారావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, పల్లవిమహేందర్ యాదవ్, అజీముద్దీన్, సయ్యద్ రసూల్, జావేద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బోరబండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక నగర్‌కు చెందిన 50మంది బీజేపీ మహిళలు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నేత జాన్సన్ నాయక్, రాష్ట్ర నాయకుడు ఎం.డి.ముజీబ్, రహ్మత్ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. శోభారాణి, జగ్దేవి, విజయకుమారి, కమలాబాయి, లక్ష్మీ తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు.



హ్యుందాయ్ వెన్యూ విడుదల చేస్తున్న సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్

మార్కెట్‌లో కొత్త హ్యుందాయ్ వెన్యూ కారు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హ్యుందాయ్ తన కొత్త కారు వెన్యూ కొత్త ఎడిషన్ అందుబాటులోకి వచ్చింది. లక్డీకాపూల్‌లోని కున్ హ్యుందాయ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వెన్యూ కొత్త ఎడిషన్ విక్రయాలను ముఖ్యఅతిథులు సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్, ఐసీఐసీఐ లాంబర్డ్ వైస్ ప్రెసిడెంట్ గణేశ్ సిద్ధార్థ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కున్ హ్యుందాయ్ జీఎంలు ఆకుల కార్తీక్, రోహిత్ కాకర్ల, రోజారాణితో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి


చక్రపాణికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ డిస్కంలో కొంతకాలంగా కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలంటూ 9 పాయింట్లతో టీజీఎస్‌పీడీసీఎల్ కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణికి తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్(టీఈసీడబ్ల్యూఏ) అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్ గురువారం మింట్ కాంపౌండ్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా, సిటీ స్టోర్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్ లభ్యత తక్కువగా ఉందని, లైన్‌క్లియరెన్స్(ఎల్‌సీ)లు వారంలో ఒక రోజు 30 నిమిషాలు ఇస్తున్నారని, దీంతో అభివృద్ధి పనులు పూర్తిచేయలేకపోతున్నామని తెలిపారు. అన్ని పనులకు కార్పొరేట్ ఆఫీస్‌నుంచి అనుమతులు ఇస్తుండడంతో పనుల్లో ఆలస్యం జరుగుతుందని, క్యాపిటల్ వర్క్స్ కొంతమందికే కేటాయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అసోషియేషన్ సెక్రటరీ మద్దునూరి వెంకటేష్, ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, కోశాధికారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగయ్య, సికింద్రాబాద్ సర్కిల్ అధ్యక్షుడు సలావుద్దీన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ పరీక్షలకు అనుమతించలేదని ఎస్పీటీయూ విద్యార్థుల నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఇంటర్నల్ ఎగ్జామ్స్ రాసేందుకు వెళ్లిన విద్యార్థులకు చుక్కెదురైంది. అటెండెన్స్ లేదనే పేరుతో దాదాపు 90 శాతం మంది విద్యార్థులను అనుమతించలేదు. ఎంసీజే ప్రథమ సంవత్సరంలో 40 మంది విద్యార్థులు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఇంటర్నల్స్ రాశారు. రెండో సంవత్సరంలో కొందరికి అనుమతి ఇచ్చినా, హెచ్‌ఓడీ తీరుకు నిరసనగా మిగిలిన విద్యార్థులు ఇంటర్నల్స్‌ను బాయ్‌కాట్ చేశారు. వర్కింగ్ పీపుల్స్, వర్కింగ్ జర్నలిస్టులు రోజూ క్లాసులకు హాజరు కాలేరని, వెసులుబాటు ఇవ్వాలని కోరారు. వి వాంట్ జస్టిస్.. అంటూ వర్సిటీ ఆవరణలో నినాదాలు చేశారు. ఎగ్జామ్ గది ఎదుట నిరసన తెలిపారు.



కొనసాగుతున్న నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలను కూల్చివేసినా.. నేతల అండతో పనులు ప్రారంభం

పేట్‌బషీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని నిర్మాణాలను అధికారులు కూల్చివేసినా.. మళ్లీ నిర్మాణలు కొనసాగుతున్నాయి. దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే 10 కమర్షియల్ దుకాణ సముదాయాలను నిర్మించారు. రెండు రోజుల క్రితం స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు కూల్చివేయిస్తుండగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు, అతడి అనుచరులు ఎక్స్‌కవేటర్ అద్దాలను ధ్వంసం చేసి, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. 24 గంటలు కాకముందే అధికార పార్టీ నేతల అండతో నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ వివరణ కోరదామని 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా స్పందించలేదు.

సైబర్ నేరాలపై 4.8 లక్షల మందికి అవగాహన

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ జాగరూకత దివస్‌ను గురువారం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం డీసీపీ బి. సాయిశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై 4.8 లక్షల మందికి అవగాహన కల్పించామని తెలిపారు. 41 విద్యాసంస్థలు, 18 పార్కులు, 5 రెసిడెన్షియల్ కమ్యూనిటీలు, 4 కార్పొరేట్ సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎఫ్ఎం రేడియోలోనూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించామన్నారు. మెట్రో రైల్ భాగస్వామ్యంతో ప్రయాణికులకు అవగాహన కల్పించామని డీసీపీ తెలిపారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్

హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్లు డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న మరో రెండు రైల్వేస్టేషన్లను డిసెంబరులో ప్రారంభించేందుకు దక్షిణమధ్యరైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్లలో రూ. 55.16కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. హైటెక్‌సిటీ స్టేషన్‌లో రూ.25.95కోట్లతో చేపట్టిన రీడెవలప్‌మెంట్ పనులు 81శాతం పూర్తికాగా, హఫీజ్‌పేట్‌లో 84 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా స్టేషన్లలో ప్రధానంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మిగిలిన పనులను నవంబరు చివరికల్లా పూర్తి చేసి డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో ఉత్తమ రచనలను ప్రోత్సహించడానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. 2024, 2025 సంవత్సరాలకు ప్రదానం చేసే పురస్కారాల ఎంపికకు పాఠకుల నుంచి సూచనలు, రచయితల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2021 జనవరి నుంచి 2024 డిసెంబరు మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన వాటిలో ఉత్తమంగా భావించిన రచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రచయిత మరణించినా వారి రచనలను సూచించవచ్చన్నారు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 10 ప్రక్రియల్లో అన్ని ప్రక్రియలకు గాని, కొన్నింటికి గాని తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చన్నారు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ కర్త పేరు పేర్కొనాలి. రచయితలు కూడా తమ గ్రంథాలను సూచించవచ్చన్నారు. కవితా సంపుటి అయితే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లో పుటల పరిమితిలేదు. రచయితలు తమ దరఖాస్తులను రిజిస్ట్రార్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి ప్రాంగణం, సాయి నగర్ రోడ్, మేడ్చల్, మాల్కాజిగిరి, హైదరాబాద్- 500118, చిరునామాకు ఈనెల 25వ తేదీలోగా పంపించాలని రిజిస్ట్రార్ కోరారు.

వ్యభిచార గృహంపై దాడి

● ఇద్దరు ఉగాండా యువతులను కాపాడిన పోలీసులు


హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, నాచారం పోలీసులు దాడిచేసి ఇద్దరు ఉగాండా మహిళలను కాపాడారు. కస్టమర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డానియేల్ అనే వ్యక్తి నాచారం భవానీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉగాండాకు చెందిన ఇద్దరు యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. లోకాంటో యాప్ ద్వారా కస్టమర్‌లను సంప్రదించిన అతడు వారికి మహిళల ఫొటోలు పంపి, ఆన్‌లైన్‌లో పేమెంట్ తీసుకొని కస్టమర్లను భవానీనగర్‌లోని వ్యభిచార గృహానికి పంపేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి కండోమ్‌లతోపాటు, డబ్బు, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కస్టమర్ సంపత్‌కుమార్ మోహితేపై కేసు నమోదు చేశారు. డానియేల్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

డిప్యూటీ రిజిస్ట్రార్‌ను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ శారదను విధుల నుంచి తొలగించాలని వామపక్ష, దళిత విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్‌లకు గురువారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని, విద్యార్థి నాయకుడు ఉప్పల ఉదయ్‌పై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. వెంటనే ఆమెను తొలగించి, కేసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుట్ట బండరాళ్లతో దినదిన గండం

తొలగించాలని బస్తీవాసుల వినతి



ప్రమాదకరంగా గుట్ట బండరాళ్లు

మారేడుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ మారేడ్‌పల్లిలోని వడ్డెర బస్తీలో జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న గుట్టరాళ్లను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నివాసాలకు పక్కనే 30 ఫీట్ల పొడవు, అడ్డం కలిగిన మూడు గుట్టరాళ్ళు ఏ సమయంలోనైనా కూలి పడే అవకాశం ఉంది. గుట్టరాళ్ల ముందు చుట్టూ పక్కల దాదాపు 20 వరకు ఇళ్లు ఉన్నాయి. ఇప్పటికే మూడు కుటుంబాలు నివాసాలను వదిలి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు ధనలక్ష్మి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వడ్డెరబస్తీలో ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో బండరాళ్లు ఒరిగిపోవడంతో పాటు వాటి కింద ఉన్న మట్టి కూడా వర్షానికి కొట్టుకుపోయిన దృశ్యాలను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న బండరాళ్లు ఇళ్లు, ప్రజలపై పడకుండా టెక్నాలజీ సహకారంతో తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆ దిశగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



నివాసాల వద్ద ఒరిగిన గుట్టరాళ్లు

అధికారులు స్పందించాలి



30 సంవత్సరాలుగా గుట్టరాళ్ల పక్కనే నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నాం. రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో గుట్టరాళ్ల కింది నుంచి వరద నీరు పారుతుండటంతో రాళ్లు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. నివాసాన్ని ఖాళీ చేసి మరో ప్రాంతంలో ఉంటున్నాం. అధికారులు స్పందించి ఈ రాళ్లను తొలగించాలని కోరుతున్నాం.

- రాజేష్, వడ్డెర బస్తీ

ఇళ్లపై ఒరిగే ప్రమాదం ఉంది



కుటుంబ సమేతంగా రేకుల ఇంటిలో నివాసం ఉంటున్నాం. ఏ క్షణమైనా ఇళ్లపై ఒరిగే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ అధికారులు తమ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

- శ్వేత, వడ్డెరబస్తీ



చీరలు పంపిణీ చేస్తున్న నరసింహన్, బాల్‌రాజ్

మహిళలకు చీరల పంపిణీ

తిరుమలగిరి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడానికి సీఎం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్ అన్నారు. గురువారం బొల్లారం డౌటన్‌బజార్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ ధర్మకర్త కాంగ్రెస్ సీనియర్ జీవి బాల్‌రాజ్, సతీష్, ఆంతోని కన్నా, గాంధీ, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన అవసరం



డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు



సైబర్ నేరాలపై పౌరులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

బోయినపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు అన్నారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసులు గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాలు ప్రమాదకరమని వివరిస్తూ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడోద్దని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫోటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బోయినపల్లి ఎస్ఐలు శివశంకర్, గణేష్ గౌడ్, అవినాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతూ పౌరులను మోసాలు చేయడానికి పూనుకుంటున్నారని వారి పట్ల జాగ్రత్తలు పాటించాలని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా గురువారం తిరుమలగిరి రవి కాలనీలోని ఐసైట్ మెడికల్ సంస్థలోని ఉద్యోగులకు సైబర్ నేరాల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అనంతరం తిరుమలగిరి లాల్‌బజార్‌లోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో కూడా విద్యార్థులకు కూడా సైబర్ నేరాలు, వాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చదువుకున్న వారు కూడా అత్యాశతో ఈ ట్రాప్‌లో పడడం దురదృష్టకరం అన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి సమాచారం సేకరించడానికి ప్రయత్నిస్తే వారిని నమ్మకూడదని అన్నారు. అవగాహన కార్యక్రమంలో డీఐ విజయరాజు, పీసీయూ రాజేష్, చారి, తేజ శైలేష్‌లు ఉన్నారు.



వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

వివాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు : ఏసీపీ

బౌద్ధనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు వివాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. భూ వివాదాల్లో, నేరాల్లో తలదూర్చవద్దని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లపై ఫిర్యాదులు అందితే వారికి కఠిన చర్యలు తప్పవన్నారు. ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, డీఐ పురేందర్‌రెడ్డి, అడ్మిన్ ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మారేడుపల్లిలోని గుంతలమయమైన రహదారిపై గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన ప్లకార్డులు

కలకలం రేపిన ప్లకార్డులు

మారేడుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.4వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చామని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రకటనను ఖండిస్తూ గురువారం మారేడుపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన ప్లకార్డులు కలకలం రేపాయి. కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇచ్చామని చెబుతున్న రూ.4వేల కోట్ల అభివృద్ధి ఇదేనా! అంటూ మారేడుపల్లిలోని గుంతలమయమైన రహదారిపై ఈ ప్లకార్డులు వెలిశాయి. కాగా ఈ విషయం తెలిసిన పోలీసులు కొద్దిసేపటికే అక్కడికి చేరుకుని, వాటిని తొలగించినట్టు తెలిసింది.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో యాత్రాదానం



బస్సుయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ చేపట్టిన యాత్రాదానం కార్యక్రమంలో భాగంగా బాలంరాయికి చెందిన పేద మహిళలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ పవిత్ర కార్తీకమాసం సందర్భంగా కాళేశ్వరం యాత్రను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం బాలంరాయిలో బస్సు వద్ద పూజ చేసి యాత్రను ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలు అంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించాలని ఈ సందర్భంగా ఆయన మహిళలకు చెప్పారు. ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఏసీపీపై వేటు

● హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసిన సీపీ సజ్జనార్

● వారంలో ముగ్గురు పోలీసులపై చర్యలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహంకాళి డివిజన్ ఏసీపీ సైదయ్యపై సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ బదిలీవేటు వేశారు. ఆయన్ను సీఏఆర్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీపీపై అవినీతి ఆరోపణలు, కిందస్థాయి సిబ్బందిని వేధిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో సీపీ అంతర్గత విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో ఆయన్ను కార్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్ తనదైన శైలిలో మార్కు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటానని మొదటిరోజు నుంచే ప్రతి సందర్భంలోనూ స్పష్టం చేస్తున్న సీపీ.. బాధ్యతలు చేపట్టిన నెలరోజుల్లోనే ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకున్నారు. వారంరోజుల వ్యవధిలోనే ఓ ఎస్సై, ఇన్‌స్పెక్టర్, ఏసీపీపై వేటువేయడం డిపార్టుమెంట్‌లో చర్చనీయాంశంగా మారింది.



ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

ఉజ్జయినీ మహాకాళి హుండీ లెక్కింపు

సికింద్రాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో దేవీ నవరాత్రులకు సంబంధించిన హుండీ లెక్కింపు గురువారం జరిగింది. రూ.24లక్షల 91వేల 699 రూపాయల ఆదాయం వచ్చింది. వాటిలో రూ.22లక్షల 83వేల 073 రూపాయల నోట్లు, రూ.2లక్షల 8వేల 626 రూపాయల కాయిన్లు ఉన్నాయి. కాగా 60 గ్రాముల 670 మిల్లీగ్రాము బంగారం, 591 గ్రాముల 300 మిల్లీ గ్రాముల వెండి కూడా హుండీ రూపంలో వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్లు సురిటి రామేశ్వర్, సురిటి కామేశ్వర్, భక్తుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరిగింది.

కనులపండువగా లక్ష దీపోత్సవం

తిరుమలగిరి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బొల్లారం డౌటన్‌బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన హనుమాన్ దేవాలయం లోని ఉప దేవాలయాలు శివాలయం, లలితా త్రిపురసుందరీదేవి ఆలయంలో అభిషేకాలు అర్చనలు లాంటి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యనిర్వహణాధికారి పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం కనులపండువగా సాగింది. సుమారు 2000మంది దీపోత్సవంలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో లలితా త్రిపుర సుందరీదేవి ఆలయం ఫౌండర్ పరుశ నిరంజన్, వెంకట రమణి దంపతులతో పాటు మాజీ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న ఈఓ మహేందర్ రెడ్డి



బోయినపల్లిలోని పోచమ్మ ఆలయంలో జరిగిన లక్ష దీపోత్సవంలో పాల్గొన్న జంపన ప్రతాప్

బోయినపల్లిలో

బోయినపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని బోయినపల్లి బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం, ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి, దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, అజిత్, ప్రేమ్ ముదిరాజ్, లక్ష్మణ్, రామారావు, పుట్టి నర్సింహ, శ్రీకాంత్, కరణ్‌సింగ్, భక్తులు పాల్గొన్నారు.



బతుకమ్మ పోటీల్లో మొదటి బహుమతి పొందిన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

విద్యార్థినులకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి

రాంగోపాల్‌పేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో కళాసిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మొదటి బహుమతిని సాధించారు. తెలంగాణ భాష, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ బాలోత్సవం వారు రెండురోజుల పాటు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జాతరలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారు. అందులో భాగంగా నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో కళాసిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థినిలు సంప్రదాయ దుస్తులు ధరించి ఆడిన బతుకమ్మ పాట నిర్వాహకులను, ఆహూతులను ఆకట్టుకోవడమే కాక మొదటి స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.

96 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం

● విక్రయదారుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ ఎక్సైజ్ డీటీఎఫ్ అధికారులు హాష్ ఆయిల్ విక్రేతతోపాటు గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. బోయినపల్లి సుచిత్ర రోడ్డులో ఓ వ్యక్తి హాష్ ఆయిల్ తీసుకెళుతున్నాడన్న సమాచారం మేరకు సికింద్రాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సౌజన్యతో పాటు సిబ్బంది కలిసి గురువారం ఉదయం నిఘా పెట్టారు. స్కూటీపై వెళుతున్న హరిబాబు అలియాస్ చింటును నిలిపి తనిఖీ చేయగా అతడి వద్ద 16 బాక్సుల్లో ఉన్న 96 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో పండించే గంజాయి నుంచి హాష్ ఆయిల్ తీసి, నగరంలో విక్రయిస్తున్నారని, స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్ విలువ రూ.50 వేల వరకు ఉంటుందని ఏఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

3.20 కిలోల గంజాయి స్వాధీనం

బొల్లారం ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు నిఘా పెట్టిన ఎక్సైజ్ డీటీఎఫ్ సిబ్బంది ముగ్గురిని అరెస్ట్ చేసి 3.20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. భరత్ కప్పా, ఉమేష్ అనే ఇద్దరు వ్యక్తుల నుంచి 2.08 కిలోలు, శశి కాంత్ అనే వ్యక్తి నుంచి 1.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు రూ.1.60 లక్షల వరకు ఉంటుందని, నిందితులను స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని డీటీఎస్ ఇన్‌స్పెక్టర్ సౌజన్య తెలిపారు. గంజాయి, హాషీష్ ఆయిల్‌ను పట్టుకున్న సిబ్బందిని డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, ఈఎస్ పంచాక్షరీలు అభినందించారు.

శ్రీనిధి ఫుట్‌బాల్ జట్టులో అకీబ్



అకీబ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వచ్చే సాకర్ సీజన్‌కు గానూ శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ మహ్మద్ అకీబ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ డిఫెండర్ గత సీజన్‌లో రియల్ కశ్మీర్ ఎఫ్‌సీ తరపున ఐ-లీగ్‌లో, డ్యూరాండ్ కప్‌లో సర్వీసెస్ జట్టు తరపున అద్భుతంగా రాణించాడు. 28 ఏళ్ల అకీబ్ రాకతో శ్రీనిధి జట్టు మరింత బలోపేతమవుతుందని మేనేజ్‌మెంట్ ఆశాభావం వ్యక్తం చేసింది.